గార ఎస్‌బీఐ కేసులో దర్యాప్తు వేగవంతం

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 27: గార ఎస్‌బీఐలో తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలు మాయమైన కేసులో దర్యాప్తు వేగవంతం చేశారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద చేపట్టిన దర్యాప్తులో కొన్ని కీలక విషయాలు పోలీసుల దృష్టికి వచ్చాయి. ఇప్పటికే ఐదు రోజులుగా నాటి కేసుకు సంబంధమున్న ఎస్‌బీఐ ఆర్‌ఎం రాజు, మేనేజర్ రాధాకృష్ణ, క్యాషియర్ సురేష్, ఫీల్డ్ ఆఫీసర్ చింతాడ శ్రీనుతోపాటు మొత్తం 15మందిని డీఎస్పీ విచారించారు. విచారణలో బ్యాంకు ఆడిట్‌కు సంబంధించిన లోపాలను పోలీసులు గుర్తించారు. ఆర్‌ఎం రాజు ఇచ్చిన స్టేట్‌మెంటును రికార్డు చేసి, ఉన్నతాధికారులకు పంపించనున్నారు.

'నాడు-నేడు' పథకంతో పాఠశాలల స్వరూపమే మార్చేశామని వైసీపీ పాలకులు చెప్పుకొచ్చారు. కానీ వాస్తవ పరిస్థితి పరిశీలిస్తే.. చాలా పాఠశాలల్లో ఎక్కడి పనులు అక్కడే వదిలేశారు. దీంతో అవి పిల్లల ప్రాణాలు బలిగొంటున్నాయి. రణస్థలం మండలం పాతర్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'నాడు-నేడు' పనుల శాపమే ఇటీవల ఓ విద్యార్థి ఉసురు తీసింది. నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనం సన్‌షేడ్ కూలి.. పాతర్లపల్లికి చెందిన వనుము కృష్ణంరాజు(15) అనే విద్యార్థి ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఇలా జిల్లాలో ఏ పాఠశాల చూసినా నాడు-నేడు పథకంలో భాగంగా పెండింగ్ పనులే కనిపిస్తున్నాయి. ఇవి ఎప్పటికి పూర్తవుతాయో.. తెలియని దుస్థితి నెలకొంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయం విద్యార్థులు, తల్లిదండ్రులను వెంటాడుతోంది.

- రణస్థలం



అసంపూర్తిగా ఉన్న పాతర్లపల్లి హైస్కూల్ 'నాడు-నేడు' భవనం



పాతర్లపల్లిలో కూలిన సన్‌షేడ్ (ఫైల్)

నాడు పాపం... నేడు శాపం!

- 'నాడు-నేడు'తో వైసీపీ ఆర్భాటం
- రెండు విడతల్లో పథకం అమలు
- బిల్లుల చెల్లింపుల్లో జాప్యం
- పనులపై తీవ్ర ప్రభావం
- నాసిరకంగా నిర్మాణాలు.. తరచూ ప్రమాదాలు
- పాతర్లపల్లి ఘటనకు అదే కారణం

'నాడు-నేడు' పథకంలో గత పాలకుల నిర్లక్ష్యం.. విద్యార్థుల పాలిట శాపమవుతోంది. వైసీపీ ప్రభుత్వం విద్యావ్యవస్థలో 'నాడు-నేడు' పథకానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా అదనపు భవనాలు, ప్రహరీ నిర్మాణం వంటి వాటిని చేపట్టింది. పనులకు సంబంధించి అదేపార్టీకి చెందిన స్థానిక నాయకులు కాంట్రాక్టర్లుగా వ్యవహరించారు. బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యమవడంతో చాలామంది అసంపూర్తిగా పనులు నిలిపివేశారు. మిగతా చోట్ల నిబంధనలకు పాతర వేస్తూ నిర్మాణాలు చేపట్టారు. దీంతో అవి విద్యార్థుల ప్రాణాలను బలిగొంటున్నాయి. బుధవారం రణస్థలం మండలం పాతర్లపల్లిలో విద్యార్థి మృతి ఘటన నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్.. పాఠశాలలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఈక్రమంలో గురువారం జిల్లాలో ఆకస్మికంగా పర్యటించారు. శ్రీకాకుళం నగరం. ఎచ్చెర్ల వీధిలోని ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. జిల్లాలో బోధనా పరిస్థితులపై ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. కాగా.. మంత్రి లోకేశ్ పర్యటనతో అధికారులు ఉరుకులు.. పరుగులు పెట్టారు.

● రూ.కోట్లలో బిల్లుల బకాయి..

జిల్లాలో మొత్తం 2,600 ప్రభుత్వ పాఠశాలల్లో 1,96,394 మంది విద్యార్థులు చదువుతున్నారు. 'నాడు-నేడు' తొలి దశలో భాగంగా 2019లో 958 పాఠశాలల భవనాలకు మరమ్మతులు చేయాలని భావించారు. కానీ అవి పూర్తికాకుండానే 2022లో రెండో విడతలో భాగంగా 1,054 భవనాల నిర్మాణానికి పూనుకున్నారు. రెండు విడతలకుగాను రూ.416.89 కోట్లు కేటాయించారు. కానీ కేవలం రూ.156.46 కోట్లు మాత్రమే చెల్లించారు. కేవలం రెండో విడత పనులకుగానూ రూ.170కోట్లు పెండింగ్ ఉన్నట్టు తెలుస్తోంది. బిల్లుల చెల్లింపు జాప్యమవడంతో కాంట్రాక్టర్లుగా వ్యవహరించిన వైసీపీకి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు విసిగిపోయారు. అనుకున్నస్థాయిలో బిల్లులు రాకపోవడంతో.. నాసిరకంగా పనులు పూర్తిచేశారన్న విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వం నిధులు సక్రమంగా చెల్లించకపోవడంతో అధికారులు సైతం ఉదాసీనంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికల ముందు ఈ బిల్లుల సంగతేంటని కాంట్రాక్టర్లు.. స్థానిక వైసీపీ ప్రజాప్రతినిధులను అడిగారు. కాగా.. ఎన్నికల్లో గెలిచేది మన పార్టీయేనని.. అధికారంలోకి వచ్చిన మరుక్షణం చెల్లిస్తామంటూ చెప్పుకొచ్చారు. కానీ ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయింది. నాడు-నేడు పనుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. దీంతో ఆ నిర్మాణాలను పూర్తిచేసేందుకు స్థానిక వైసీపీ ప్రజాప్రతినిధులు ముందుకు రాని పరిస్థితి. అసంపూర్తిగా ఉన్న పనులు.. ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

● ఆనవాయితీకి వైసీపీ బ్రేక్..

సాధారణంగా ఎన్నికలకు ముందు ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, నిర్మాణాలకు సంబంధించి బిల్లులను.. తరువాత వచ్చిన ప్రభుత్వం చెల్లించడం ఆనవాయితీగా వస్తోంది. కానీ అది 2019 నుంచి బ్రేక్ పడింది. జగన్ సర్కారు వచ్చిన తరువాత రివర్స్ టెండరింగ్ ఆలోచన చేశారు. గత టీడీపీ ప్రభుత్వం చేపట్టిన నిర్మాణాలకు నిధుల చెల్లింపులు చేయలేదు. చివరకు న్యాయస్థానాల ఆదేశాలను సైతం బేఖాతరు చేశారు. టీడీపీ హయాంలో నీరు-చెట్టు, ఉపాధిహామీ కాంపోనెంట్ నిధులతో చేపట్టిన పనులకు బిల్లులు ఉంచేశారు. అందుకే ఇప్పుడు వైసీపీ నేతలు అనుమానంతో ఉన్నారు. బిల్లులు వస్తాయా? రావా? అని ఆందోళన చెందుతున్నారు. జగన్ సర్కారు నిర్వాకం వల్ల రావని ఒక నిర్ధారణకు వస్తున్నారు. దీనికితోడు 'నాడు-నేడు' పథకంలో భాగంగా పాఠశాలల్లో ఫర్నీచర్, విద్యుత్, శానిటరీ, రక్షిత నీటి పథకం ప్లాంట్లను ఏర్పాటు చేశారు. వీటన్నింటినీ అస్మదీయ కంపెనీలకు అప్పగించారు. కమీషన్లు అందుకొని అప్పట్లోనే బిల్లులు చేశారు. కానీ వైసీపీ దిగువ స్థాయి నాయకులకు మాత్రం జగన్ మోసగించారు. పనులు చేపట్టినా బిల్లులు చెల్లించలేదు. అందుకే చాలాచోట్ల పనులు నిలిచిపోయాయి. మొండిగోడలతో అవి దర్శనమిస్తున్నాయి. నాడు-నేడు పనుల విషయంలో కూటమి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. ఇప్పటికే దీనిపై విద్యాశాఖ మంత్రి లోకేష్ ప్రత్యేకంగా దృష్టి సారించినట్టు తెలుస్తోంది.

● నాసిరకం పనులు

గత ప్రభుత్వ హయాంలో మంజూరైన నాడు-నేడు పనులు అస్తవ్యస్తంగా జరిగాయి. సక్రమంగా నిధుల కేటాయించలేదు. పనులు కూడా పూర్తిస్థాయిలో చేపట్టలేదు. పూర్తిచేసిన చోట నాసిరకంతో మమ అనిపించేశారు. అవే ఇప్పుడు విద్యార్థుల ప్రాణాలను బలిగొంటున్నాయి. ఈ శాపం జగన్‌కు తగలక మానదు.

- నడుకుదిటి ఈశ్వరరావు, ఎమ్మెల్యే, ఎచ్చెర్ల

ప్రత్యేక ఆదేశాలు

నాడు-నేడు అసంపూర్తి నిర్మాణాల విషయంలో పాఠశాల సిబ్బందికి ప్రత్యేక ఆదేశాలు ఇచ్చాం. అక్కడ బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించాం. అసంపూర్తిగా పనులు చేపట్టిన భవనాల్లో విద్యాబోధన చేపట్టకూడదని ఆదేశించాం. భోజన విరామ సమయాల్లో కూడా పిల్లల కదలికలపై దృష్టి పెట్టాలని సూచించాం. విద్యార్థులపై పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణ ఉండాలి. ప్రధానోపాధ్యాయులు కూడా విద్యార్థులు పట్ల అప్రమత్తంగా ఉండాలి


- తిరుమల చైతన్య, డీఈవో, శ్రీకాకుళం

శిథిల గదులకు తాళాలు

● అప్రమత్తమైన అధికారులు



శిథిలావస్థకు చేరిన లక్ష్మీపేట తరగతి గదికి తాళాలు వేస్తున్న ఎంఈవో -2



లక్ష్మీపేట తరగతి గది ముందు పెట్టిన ప్రకటన

పొందూరు: జిల్లాలోని చాలా ప్రభుత్వ పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎప్పుడు.. ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయం ఉపాధ్యాయులు, విద్యార్థులను వెంటాడుతోంది. ఇటీవల రణస్థలం మండలం పాతర్ల పల్లి పాఠశాలలో జరిగిన ప్రమాద ఘటనలో విద్యార్థి మృతి చెందడంతో విద్యాశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రమాదకరంగా ఉన్న తరగతి గదులకు తాళా లు వేస్తున్నారు. నిషేధిత ప్రదేశాలుగా బోర్డులు పెట్టి.. విద్యార్థులను లోపలికి వెళ్లకుండా కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

● పొందూరు మండలంలోని జోగన్నపేట, లక్ష్మీపేట, లచ్చయ్యపేట, గోరింట, గోకర్ణపల్లితోపాటు తొమ్మిది పాఠశాలల గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. శ్లాబు లు పెచ్చులూడి ప్రమాదకరంగా మారాయి. పాతర్లపల్లి ఘటన నేపథ్యంలో ఈ గదులను మూసేశారు. ఎంఈవో-2 పాఠశాలలకు వెళ్లి నిషేధిత బోర్డులు పెట్టడంతోపాటు తరగతి గదులకు తాళాలు వేశారు. అయినప్పటికీ శిథిల భవనాల వద్దకు విద్యార్థులు ఆటలాడేందుకు వెళ్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. శిథిల భవనాలను కూల్చేసి.. కొత్తవి నిర్మించాలని కోరుతున్నారు.

'జే' బ్రాండ్లకు.. మంగళం

- ప్రభుత్వ మద్యం దుకాణాలు రద్దు
- ఇకపై అన్నీ ప్రైవేటు దుకాణాలే..
- నేడు 161 షాపుల ఏర్పాటుకు నోటిఫికేషన్
- నాణ్యమైన మద్యం విక్రయానికి ఏర్పాట్లు





(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

వైసీపీ పాలనలో బ్రాండెడ్ మద్యం అందుబాటులో ఉంచలేదు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో 'జే' బ్రాండ్ల పేరిట నాణ్యతలేని మద్యాన్ని అంటగట్టి.. ఇష్టానుసారంగా ధరలు పెంచేసి మందుబాబులను దోచుకున్నారు. వారి ప్రాణాలతో సైతం చెలగాటమాడారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం.. 'జే' బ్రాండ్లకు శాశ్వత మంగళం పాడాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేసింది. ఇకపై ప్రైవేటు దుకాణాల్లో బ్రాండెడ్ మద్యం విక్రయించేలా చర్యలు చేపట్టనుంది. ప్రైవేటు దుకాణాల ఏర్పాటుకు సంబంధించి శనివారం నోటిఫికేషన్ జారీ చేయనుంది. జిల్లాలో 161 ప్రభుత్వ మద్యం దుకాణాలు, 23 బార్‌లు ఉన్నాయి. బార్‌లకు మరో ఏడాది వరకు గడువు ఉంది. అందుకే ప్రస్తుతానికి ప్రభుత్వ మద్యం దుకాణాలను ప్రభుత్వం రద్దుచేసింది. శనివారం 161 ప్రైవేటు దుకాణాల ఏర్పాటుకు నోటిఫికేషన్ వెలువడనుంది. కొద్దిరోజుల్లో మరో పదిశాతం ప్రైవేటు దుకాణాల ఏర్పాటుకు మళ్లీ నోటిఫికేషన్ విడుదల కానుంది. ఎన్నికల సమయంలో కల్లు గీత కార్మికులకు కూడా మద్యం దుకాణాల ఏర్పాటులో అవకాశమిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇందులో భాగంగా మరో 16 దుకాణాలు.. కల్లు గీత కార్మికులకు కేటాయించనుంది.

● ఎక్సైజ్ ప్రక్షాళన దిశగా..

జిల్లావ్యాప్తంగా పాతపద్ధతిన ప్రైవేటు మద్యం దుకాణాలే ఉండనున్నాయి. అక్రమాలు జరగకుండా ఎక్సైజ్ అధికారులు.. పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాల్సి ఉంది. ఇప్పటికే జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌లో కీలక అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. కార్పొరేషన్‌లో డీఎంగా ఇన్నాళ్లు విధులు నిర్వహించి తీవ్రస్థాయిలో ఆరోపణలు 'మూట'గట్టుకున్న అధికారిని విశాఖకు బదిలీ చేసింది. మరో రెండు మూడు రోజుల్లో సీఐలు, ఎస్‌ఐలు, కానిస్టేబుళ్ల బదిలీ జరగనుంది. మొత్తం ఎక్సైజ్‌శాఖ ప్రక్షాళన కానుంది.

● గత్యంతరం లేక నాసిరకం..

గత ఐదేళ్లు నాసిరకమైన మద్యాన్ని విక్రయించారు. బూమ్‌బూమ్.. ఆంధ్రాగోల్ వంటి సొంత బ్రాండ్లు తయారు చేసి.. అధిక ధరలకు విక్రయించేవారు. గత్యంతరం లేక.. పెంచిన ధరలను తట్టుకుంటూ మందుబాబులు తెగ బాధపడ్డారు. తాజాగా కూటమి ప్రభుత్వ నిర్ణయంతో జే బ్రాండ్ల మద్యం పీడ విరగడకానుందని సంబర పడుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం అన్ని మద్యం దుకాణాల్లోనూ ఇంపీరియల్ బ్లూ, మెక్‌డోల్, బ్లెండర్‌స్ప్రైడ్ వంటి బ్రాండ్లను అందుబాటులో ఉంచింది. ఐదేళ్ల కిందట అందుబాటులో ఉండే బ్రాండ్ల బీర్లను విక్రయించేలా చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతం జిల్లాలో ఉన్న 161 మద్యం దుకాణాల్లో పది రోజులకు సరిపడా విక్రయాలకు అవాంతరం లేకుండా సరుకును సరఫరా చేశారు. రవాణా చెల్లింపుల సమస్య ఉండటం వల్ల వాహనాల సంఖ్య తగ్గింది. దీంతో కొన్ని వాహనాల్లోనే అన్ని మద్యం దుకాణాలకు సరుకును పంపుతున్నారు. మద్యం కొరత లేకుండా.. ప్రైవేటు దుకాణాలు ఏర్పాటయ్యే వరకు ముందస్తు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం నాణ్యమైన బ్రాండ్లు అందుబాటులోకి రావడంతో మద్యం ప్రియులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



తేలినీలాపురంలో చెట్లపై విదేశీ పక్షుల సందడి

విదేశీ అతిథులు.. వచ్చేశాయి

- సైబీరియా టు తేలినీలాపురం
- పెలికాన్, పెయింటెడ్‌స్టార్ పక్షుల సందడి



(టెక్కలి)

సైబీరియా ప్రాంతం మెడ్వేజ్ దీవుల నుంచి.. వినీలా కాశంలో సుమారు 12వేల కిలోమీటర్లకుపైగా ఎగురుతూ.. సాగరాలు దాటుకుంటూ.. విదేశీ అతిథులైన పెలికాన్, పెయింటెడ్‌స్టార్ పక్షులు టెక్కలి మండలం తేలినీలా పురానికి చేరుకున్నాయి. పెలికాన్ పక్షులు చెట్లపై వాలాయి. పెయింటెడ్‌స్టార్ పక్షులు ఊరిచుట్టూ చక్కర్లు కొడుతున్నాయి. కొన్ని దశాబ్దాలుగా ఈ విదేశీపక్షులు ఏటా సెప్టెంబరు నెలాఖరులో వచ్చి ఏప్రిల్‌లోగా ఇక్కడే సంతానోత్పత్తి చేసి.. తిరిగి వెళ్లిపోతాయి. ఈ పక్షులు ముందు జతలుగా ఏర్పడి గ్రామంలోని చింత, వెదురు, రావి, వేప, సీమచింత తదితర చెట్లపై గూళ్లు ఏర్పాటు చేసుకుంటాయి. రెండు నుంచి నాలుగుగుడ్లు వరకు పొదిగి నెల రోజుల్లో పిల్లలను చేస్తాయి. వాటిని సంరక్షిస్తాయి. సమీప చెరువుల్లో వేటాడి తెచ్చిన చేపపిల్లలను వాటికి ఆహారంగా అందిస్తాయి. పిల్లలు కొంచెం పెద్దయిన తర్వాత.. వాటితోపాటు ఎగురుకుంటూ సైబీరియాకు వెళ్లిపోతాయి. ఈ పక్షులు వచ్చాయంటే తేలినీలాపురం గ్రామస్థులకు పంటలు పుష్కలంగా పండుతాయని నమ్మకం. 1960 ఫిబ్రవరి 20న గ్రామంలో అగ్నిప్రమాదం జరిగి అప్పట్లో పక్షులు మంటల్లో ఆహుతయ్యాయి. అయినా పక్షులు ఏటా ఇక్కడకు వచ్చి విడిది చేస్తూనే ఉన్నాయి. వీటిని అతిథులుగా గ్రామస్థులు భావించి.. ఆదరిస్తున్నారు. పక్షుల పర్యవేక్షణ బాధ్యతను అటవీ శాఖ అధికారులు చేపడుతున్నారు.

పదేళ్ల తర్వాత విచారణ

● అక్రమ వసూళ్లపై విచారణాధికారి నియామకం

శ్రీకాకుళం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): సరిగ్గా పదేళ్లు దాటిన తర్వాత విచారణ చేపడుతున్న ఘటన జిల్లాలో నెలకొంది. దీనిపై ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు విడుదల చేయడం విశేషం. 2014 జనవరి 18న ఇచ్ఛాపురంలో పురుషోత్తపురం చెక్‌పోస్టు వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో ఏసీటీఓ డుంబరు బెహరా, డీసీటీఓ పి. ఆనందరావు, కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ జూనియర్ అసిస్టెంట్ కూన శ్రీనివాస్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి.రాజన్న, అసిస్టెంట్ మార్కెట్ సూపర్‌వైజర్(ఏఎంసీ) ఆర్జి దుర్గారావు అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. వారి నుంచి కొంతమొత్తంలో అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు ప్రభుత్వానికి తనిఖీ బృందం నివేదిక ఇచ్చింది. ఈ ఘటనపై ఇప్పుడు విచారణ జరపాలని ఉత్తర్వులు విడుదలయ్యాయి. విచారణ అధికారిగా అడిషనల్ కమిషనర్ కృష్ణ మోహన రెడ్డిని ప్రభుత్వం నియమించింది. రెండు నెలల్లో విచారణ చేసి.. అప్పట్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి నుంచి వాంగ్మూలం సేకరించాలని సూచించింది. పూర్తిస్థాయిలో విచారణ నివేదికను అందజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

డేంజర్.. డేంజర్..

అలికాం-బత్తిలి ప్రధాన రహదారిలో ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది. ఈ మార్గంలో ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. తాజాగా శుక్రవారం సరుబుజ్జిలిలోని పెట్రోల్ బంకు సమీపంలో ఈ రహదారి గుంతలో గ్యాస్ సిలెండర్ వాహనం కూరుకుపోయింది. దీంతో వాహనంలోని సిలెండర్లు రోడ్డుమీద పడిపోయాయి. ఆ సమయంలో భారీ శబ్దం రావడంతో.. ఎటువంటి అగ్నిప్రమాదం సంభవిస్తుందోనని ప్రయాణికులు, స్థానికులు భయాందోళన చెందారు. కాగా.. గ్యాస్ సిలెండర్లు లీకు కాకపోవడంతో ప్రమాదం తప్పిందని అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ మార్గంలో నిత్యం వాహనాలు కూరుకుపోతున్నా.. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు కనీసం గుంతలు కూడా పూడ్చడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- సరుబుజ్జిలి



నా కెరీర్‌లో బెస్ట్ ఫిల్మ్ అంటున్నారు



కొరటాల శివ

'మా అందరి నాలుగేళ్ల కష్టమే 'దేవర' చిత్రం. ఆదరిస్తున్న ప్రేక్షకులకు, ఇస్తున్న రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్లకు ధన్యవాదాలు. నందమూరి అభిమానులకు మేమెప్పుడూ రుణపడి ఉంటాం. 'దేవర' కోసం దర్శకుడు కొరటాల శివ చాలా కష్టపడ్డారు. ఎన్టీఆర్ ఇరగదీశాడు. తను వన్ మ్యాన్ షో చేశాడు. నాకెంతో గర్వంగా ఉంది' అన్నారు కల్యాణ్‌రామ్. ఎన్టీఆర్ ద్విపాత్రాభినయంతో ఆయన నిర్మించిన 'దేవర' చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సెలబ్రేషన్స్‌లో ఆయన మాట్లాడారు. ఆ తర్వాత కొరటాల శివ మాట్లాడుతూ 'ఇంత పెద్ద విజయాన్ని అందించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. మూడేళ్ల కష్టం 'దేవర'. నా కెరీర్‌లోనే బెస్ట్ ఫిల్మ్ అంటున్నారు. ఈ అవకాశం ఇచ్చిన ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్, సుధాకర్‌లకు ధన్యవాదాలు. చివరి నిముషం వరకూ అందరూ కష్టపడ్డారు. అందుకే ఇంత పెద్ద విజయం దక్కింది' అన్నారు. 'దేవర' చిత్రాన్ని తెలంగాణలో విడుదల చేసిన దిల్ రాజు మాట్లాడుతూ ' స్టార్ హీరో సినిమా రిలీజ్ అనగానే పండగ వాతావరణం ఉంటుంది. నేను రాత్రి సినిమా చూశా. ఈ చిత్రం ఇంత పెద్ద విజయం సాధించిందంటే కారణం ఎన్టీఆరే. వన్ మ్యాన్ షోతో సినిమాను నిలబెట్టారు' అన్నారు.



వరద బాధితుల సహాయార్థం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు రూ.25 లక్షల చెక్కు అందజేస్తున్న మంచు మోహన్‌బాబు, విష్ణు

'ఢిల్లీలో మీ స్నేహితులు...' అనకుండా ఉండాల్సింది'

- ప్రకాశ్‌రాజ్ ఉద్దేశం నాకు అర్థమైంది - ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



'ప్రకాశ్‌రాజ్ సోషల్ మీడియా ద్వారా వెలిబుచ్చిన అభిప్రాయాన్ని నేను తప్పుగా అర్థం చేసుకోలేదు. ఆయన ఉద్దేశం నాకు సరిగానే అర్థమైంది' అని పవన్ కల్యాణ్ వెల్లడించారు తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో పెట్టిన ఓ పోస్ట్‌లో పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి 'మీ వ్యాఖ్యలు మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టేలా ఉన్నాయి... కేంద్రంలోని మీ స్నేహితులకు ధన్యవాదాలు' అని ప్రకాశ్ రాజ్ ట్వీట్ చేయడం దుమారం రేపింది. దీనిపై తాజా ఇంటర్వ్యూలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ 'భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. దోషులకు శిక్ష పడాలనే ఉద్దేశంతో నేను స్పందిస్తే... 'ఢిల్లీలో మీ స్నేహితులు...' అంటూ కామెంట్ చేయాల్సిన అవసరం ప్రకాశ్‌రాజ్‌కు లేదు. ఆయన పోస్ట్‌ను నేను తప్పుగా అర్థం చేసుకోలేదు. ఆయన ఉద్దేశం నాకు సరిగానే అర్థమైంది' అని చెప్పారు. 'ప్రకాశ్‌రాజ్ నాకు మంచి మిత్రుడు. రాజకీయంగా దారులు వేరైనా మా మధ్యన ఒకరంటే ఒకరికి గౌరవం ఉంది. ఆయనతో కలసి పనిచేయడం ఇష్టం' అని కూడా పవన్ చెప్పారు.

మనకేం కావాలి.... ప్రకాశ్‌రాజ్ తాజా ట్వీట్


తిరుపతి లడ్డూ కల్తీ వివాదంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకున్న ప్రకాశ్‌రాజ్ శుక్రవారం మరోసారి సోషల్ మీడియా వేదికగా విమర్శలకు దిగారు. అందులో 'మనకేం కావాలి... ప్రజల్లో భావోద్వేగాలను రెచ్చగొట్టి... తద్వారా రాజకీయ లబ్ధిని సాధించడమా? లేక ప్రజల మనోభావాలు గాయపడకుండా...పరిపాలనా సంబంధమైన... అవసరమైన తీవ్రమైన చర్యలతో... సున్నితంగా సమస్యను పరిష్కరించుకోవడమా?' అంటూ పవన్ కల్యాణ్ పేరును ప్రస్తావించకుండా ప్రకాశ్ రాజ్ ట్వీట్ చేశారు.

మూల్యం చెల్లించుకోకతప్పదు - ఖుష్బూ

లడ్డూ వివాదంపై నటి ఖుష్బూ స్పందించారు. తిరుమల లడ్డూను కల్తీ చేసినవాళ్లు ఎవరైనా మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. 'ఆ వేంకటేశ్వర స్వామి అంతా చూస్తున్నాడు. లడ్డూను కల్తీ చేయడం అంటే కోట్లాది మంది ప్రజల విశ్వాసాలు, మనోభావాలు దెబ్బతీయడమే. అని ఖుష్బూ చెప్పారు.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
శ్రీకాకుళం శనివారం • 28 సెప్టెంబరు 2024
cinema@andhrajyothy.com

వంద రోజుల్లో విజయాలెన్నో...



ఆరు హిట్స్.. అనేక ఫ్లాపులతో చిత్రసీమ ప్రథమార్థాన్ని ముగించింది. అతి కీలకమైన ద్వితీయార్థంలో ఇప్పటి వరకు వచ్చిన సినిమాలలో.. భారీ చిత్రాలు అంచనాలను అందుకోవడంలో విఫలమయ్యాయి. ఇప్పటికే మూడు నెలలు ముగిశాయి. ఇక ఉన్నది మూడు నెలలే.. ఈ మూడు నెలల్లో అరడజను భారీ చిత్రాలు క్యూలో ఉండటం విశేషం. వాటిలో అలరించేవి ఎన్ని.. చరిత్ర సృష్టించేవి ఏవి.. అంచనాలను తారుమారు చేసేవి ఎన్నో తెలియాలంటే ఏడాదిలోని ఆఖరి వారం వరకూ వేచి చూడాల్సిందే.

పుష్పరాజ్ కోసం ఎదురుచూపులు

2021లో విడుదలైన 'పుష్ప' సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఏ రేంజ్‌లో సత్తా చాటిందో అందరికీ తెలిసిందే. ఈ సినిమాకు కొనసాగింపుగా పార్ట్ 2 ఉంటుందని దర్శకుడు



సుకుమార్ మంచి హైప్‌తో క్లైమాక్స్‌ను ముగించారు. మొదటి భాగానికి మించిన హిట్ కొట్టాలనే లక్ష్యంతో మేకర్స్ ఈ సీక్వెల్‌ను చాలా జాగ్రత్తగా తీర్చిదిద్దుతున్నారు. మొదటి భాగంలో పుష్పరాజ్‌గా అందరినీ అలరించిన అల్లుఅర్జున్.. రెండో భాగం 'పుష్ప:ద రూల్'లో ఏ రేంజ్‌లో చెలరేగుతాడో అని అభిమానులు ఆసక్తిగా కోసం ఎదురుచూస్తున్నారు. డిసెంబరు 6న సినిమా విడుదల కానుంది.

గేమ్ చేంజర్‌గా...

రామ్‌చరణ్, డైరెక్టర్ శంకర్ కలయికలో తెరకెక్కుతోన్న మాగ్నమ్ ఆపస్ ఎంటర్టైనర్ 'గేమ్ చేంజర్'. ఈ సినిమాలో రామ్‌చరణ్ రెండు విభిన్న పాత్రల్లో కనిపించనున్నారని టాక్. అందులో ఒక పాత్ర అవినీతితో పోరాటం చేస్తుందని సమాచారం. ఈ సినిమాపై అభిమానులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. డిసెంబరు 20న ఈ సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

దసరాకి వేట మొదలు

'జై భీమ్' ఫేమ్ టీ.జే.జ్ఞానవేల్ దర్శకత్వంలో రజనీకాంత్ నటిస్తున్న చిత్రం 'వేట్టయాన్' (ద హంటర్). ఇందులో అమి





తాబ్ బచ్చన్, రానా దగ్గుబాటి, ఫహాద్ ఫాజిల్, మంజువారియర్, రితికా సింగ్ కీలక పాత్రలు పోషించారు. రజనీకాంత్, అమితాబ్ 33 ఏళ్ల తర్వాత కలసి నటిస్తున్న చిత్రం ఇదే కావడంతో ఈ సినిమాపై అంచనాలు ఓ రేంజ్‌లో ఉన్నాయి. ఇందులో ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా రజనీ కనిపించనున్నారు. ఈ సినిమా దసరా కానుకగా అక్టోబరు 10న ప్రేక్షకులను పలకరించనుంది. 'జైలర్'తో సూపర్ హిట్ కొట్టి మంచి ఫామ్‌లో ఉన్న రజనీకాంత్‌కు ఈ సినిమా అంతకుమించిన సక్సెస్ ఇస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

కన్నప్ప కనువిందు...

మంచు విష్ణు నటిస్తున్న మైథలాజికల్ చిత్రం 'కన్నప్ప'. అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న ఈ సినిమాకు ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకుడు. ఇందులో ప్రభాస్, అక్షయ్‌కుమార్, మోహన్‌లాల్ సహా పలువురు తారలు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను కేన్స్ చిత్రోత్సవంలో విడుదల చేయడం విశేషం. డిసెంబర్ 20న విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

పోరాట యోధుడి పాత్రలో...

తమిళ హీరో సూర్య పోరాట యోధుడిగా.. నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కంగువ'. నవంబర్ 14న దాదాపు పది



భాషల్లో త్రీడీలో, 2డీలో విడుదలవుతోంది. ఈ భారీ పీరియాడికల్ యాక్షన్ ఫిల్మ్‌కు 'వేదాలమ్', 'వీరుడొక్కడే', 'వివేకం' వంటి చిత్రాలు తీసిన శివ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాతో సూర్యకు పాన్ ఇండియా గుర్తింపు ఖాయం అని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు.

గోపీచంద్ విశ్వం

గోపీచంద్ నటిస్తున్న యాక్షన్ ఎంటర్టైనర్ 'విశ్వం'. శ్రీనువైట్ల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాపై మంచి అంచనాలు ఉన్నాయి. వరుస ఫ్లాపుల్లో ఉన్న గోపీచంద్‌కు, శ్రీనువైట్లకు ఈ సినిమా రిజల్ట్ కీలకం కానుంది. దసరా కానుకగా అక్టోబర్ 11న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

విస్తారంగా వర్షాలు

(ఆంధ్రజ్యోతి బృందం)

బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా జిల్లాలో వివిధ ప్రాంతాల్లో గురువారం రాత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో పొలాల్లో నీరు చేరింది. అలాగే సాగు నీటి కాలువల ద్వారా వర్షపు నీరు శివారు ప్రాంతాలకు చేరింది. పలు వీధుల్లో నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పలాస మండలంలోని వరహాలగెడ్డ, హరి సాగరం, మహేంద్ర సాగరాలకు నీరు చేరడంతో నిండిన కుండలా కనిపిస్తున్నాయి. కేదారిపురం వద వరహాల గెడ్డకు మహేంద్రగిరుల నుంచి నీరు భారీగా చేరింది. హరిసాగరం, లొత్తూరు రిజర్వాయర్‌లోకి నీరు చేరింది. నౌపడా-మెళియాపుట్టి రోడ్డుపై భారీ చెట్టు కూలి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. చీపి-బుడంబో రోడ్డులో వంతెన పైనుంచి ప్రవహిస్తున్న నీటి ప్రవాహంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



పలాస: చెరువును తలపిస్తున్న పంట పొలాలు



టెక్కలి: నౌపడా-మెళియాపుట్టి రోడ్డుపై కూలిన చెట్టు



పలాస రూరల్: కేదారిపురం వద్ద వరహాలగెడ్డపై వర్షపు నీరు



నందిగాం: జగనన్న కాలనీలో వర్షపునీరు



సంతబొమ్మాళి: జగన్నాథపురం వీధిలో నిలిచిపోయిన వర్షపు నీరు



హరిపురం: చీపి-బుడంబో రోడ్డులో వంతెన పైనుంచి ప్రవహిస్తున్న వరదనీరు



వజ్రపుకొత్తూరు: నువ్వలరేవు-మంచినీళ్లపేట రోడ్డు

దేశంలోనే అగ్రగామి.. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యం: శిరీష

పలాస: దేశంలోనే రాష్ట్రం అగ్రగామిగా నిలవడమే స్వర్ణాంధ్ర-2047 విజన్ లక్ష్యమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశా లలో శుక్రవారం స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమం నిర్వహించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'ఇది మంచి ప్రభుత్వం-ఇది ప్రజల ప్రభుత్వం' అనే నినాదంతో ఈ కార్యక్రమం రూపొందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, వెంకటరమణ, మధు పాల్గొన్నారు.

డ్వాక్రా బజార్‌ను వినియోగించుకోండి

కాశీబుగ్గ: కాశీబుగ్గ బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన డ్వాక్రా బజార్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శిరీష అన్నారు. శుక్రవారం డ్వాక్రా బజార్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మెప్మా ద్వారా మహిళా సంఘాల ప్రతినిధులు బ్యాంకు లింకేజీ పొంది తయారు చేసిన ఉత్పత్తులను స్థానికంగా విక్రయించేందుకు ఈ బజార్ దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, కమిషనర్ రామారావు, టీడీపీ నేతలు లొడగల కామేశ్వరరావు, బడ్డ నాగరాజు, గాలి కృష్ణారావు, సప్ప నవీన్, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

అనధికారికంగా హాస్టళ్లు నిర్వహిస్తే చర్యలు

హిరమండలం: అనధికారకంగా హాస్టళ్లను నిర్వహిస్తే చర్యలు తీసుకుంటున్నామని జిల్లా బాలల రక్షణ అధికారి కేవీ రమణ స్పష్టం చేశారు. జిల్లాల బాల వసతి గృహాల ఇన్స్పెక్షన్ బృందం, జిల్లా బాలల సంక్షేమ సమితి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం హిరమండలంల వసతి గృహాలను తనిఖీ చేశారు. హిల్ కాలనీలో గ్రేస్ చర్చి బాలల వసతి గృహాన్ని తనిఖీ చేసి ఎలాం టి అనుమతులు లేకపోవడాన్ని గుర్తించారు. అక్కడ వసతి పొందుతున్న 21 మంది బాలలను బాలల సంక్షేమ సమితి ఎదుట హాజరు పరిచిన అనంతరం వారి తల్లిదండ్రులకు అప్పగించారు. మరికొందరు పిల్లలను శ్రీకాకుళంలోని వివిధ ప్రభుత్వ హాస్టళ్లలో చేర్పించినట్లు కేవీ రమణ తెలిపారు. కార్యక్రమంలో బాలల రక్షణ చట్టం అధికారులు మెట్ట మల్లేశ్వరరావు, ఐఎల్ నాయుడు, టి.లక్ష్మణరావు, సభ్యులు వి.రమణమూర్తి, ఎం.గున్నప్పుడు, సుధారాణి పాల్గొన్నారు.

అటవీ భూములపై నిఘా ఉంచండి

పాతపట్నం: పాతపట్నం పరిసరాల్లోని అటవీ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, నిఘా పెట్టాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సూచించారు. ఫారెస్టరేంజర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.అమ్మన్నాయుడు శుక్రవారం ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిశారు. ● పేద కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని శ్రీనీలమణి దుర్గ ఉత్తరాంధ్ర కళాకారుల సంక్షేమ సంఘం వైస్ ప్రెసిడెంట్ కంబుభుక్త చిన్నారావు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే మామిడి గోవిందరావును శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి సమస్యలను విన్నవించారు. సంక్షేమసంఘం కార్యదర్శి రమణమూర్తి, ప్రచార కార్యదర్శి ముత్యాలరావు, ధర్మరాజు, కళాకారులు పాల్గొన్నారు.



వరద బాధితులకు విరాళం

కోటబొమ్మాళి: తిలారు మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు విజయవాడ వరద బాధితులకు విరాళం అందించారు. మాజీ ఎంపీపీ తర్ర రామకృష్ణ ఆధ్వర్యంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును నిమ్మాడలో కలిసి రూ.15 వేల చెక్కును అందజేశారు.

రైలు దిగుతూ జారిపడిన తల్లీ బిడ్డ

టెక్కలి: నౌపడా రైల్వే జంక్షన్ పరిధిలో శుక్రవారం గుణుపూర్-విశాఖ రైలు నుంచి ఓ యువతి చంటి బిడ్డను పట్టుకొని రైలు దిగే సమయంలో ఒక్కసారిగా ప్లాట్‌ఫారంపై పడిపోయింది. దీంతో స్పందించిన తోటి ప్రయాణికులు వారిని లేపి సపర్యలు చేశారు. తల్లీబిడ్డకు త్రుటిలో ప్రమాదం తప్పడంపై అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

వసతి గృహాల పరిశీలన

టెక్కలి: రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి టెక్కలిలోని బాలికల, గిరిజన బాలికల హాస్టళ్లు, బీసీ, సోషల్ వెల్ఫేర్ కళాశాలల వసతిగృహాలను సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు సందర్శించారు. వసతి గృహాల్లో వసతి సౌకర్యాలు, ఆహారం, వైద్య సౌకర్యాలు, వంటగదులు, పరిశుభ్రత, మెనూ, స్టాక్ నిల్వలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ట్యూటర్ల నియామకాలపై ఆరా తీశారు. విద్యార్థినులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత సంక్షేమాధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌వోడబ్ల్యూలు విజయ లక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

కోటబొమ్మాళి: లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, ఇటువంటివి ఎవరు చేసినా జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తారని జూనియర్ సివిల్ న్యాయాధికారి బీఎంఆర్ ప్రసన్నలత అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం లింగ వివక్షపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లఖినేని శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ టి.సంతోషి పాల్గొన్నారు.

రేపు దళిత ఆదివాసీల సదస్సు

టెక్కలి: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక ఆదిత్య కల్యాణమండపంలో దళిత ఆదివాసీల సదస్సు నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోకర నారాయణరావు, చల్లా రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. దళిత ఆదివాసీలు, బహుజనులు హాజరు కావాలని ఆయన కోరారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

నరసన్నపేట: పురుగుమందులు విక్రయించే వ్యాపారులు నిబంధనలు పాటించకుంటే దుకాణాలను సీజ్ చేస్తామని ఏవో సునీత అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు పురుగుమందుల దుకాణాల్లో తనిఖీ చేపట్టారు.

2047 నాటికి భారత్‌ను అగ్రస్థానంలో నిలపాలి

● సెంచూరియన్ అంతర్జాతీయ సదస్సులో వక్తలు

ఒడిశా

పర్లాకిమిడి: భారత్‌ను 2047 నాటికి ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలు వురు వక్తలు అన్నారు. పర్లాకిమిడి సెంచూరియన్ విశ్వవిద్యాల యంలో శుక్రవారం వికసిత్ భారత్‌పై అంతర్జాతీయ సదస్సును ప్రారంభించారు. ఈ సదస్సులో వివిధ దేశాల నుంచి విద్యావేత్తలు మాట్లాడారు. ఇన్నోవేటివ్ బిజి నెస్, అగ్రికల్చర్, టెక్నాలజీ ఆఫ్ రీసోర్స్ మేనేజ్‌మెంట్ ఫర్ సస్టెయినబుల్ గ్రోత్‌పై వర్చువల్ మాధ్యమం ద్వారా వికసిత్ భారత్-2047 విజన్‌కు అందరూ సహకరించాలని కోరారు. ఈ సదస్సులో ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, యూఏఈ, యూకేలతో పాటు 15 దేశాల విద్యావేత్తలు, పరిశోధకులు పాల్గొన్నారు. ఈ సదస్సులో నేషనల్ ఇన్నర్మేటివ్ సెంటర్ మాజీ డైరెక్టర్ జనరల్, ప్రొఫెసర్ మోనిమాడస్వామి, మోనాస్ యూనివర్శిటీ (మలేషియా) ప్రొఫెసర్ వి. మోహనర్ ఆవారి, వెస్ట్రన్ సిడ్నీ విశ్వ విద్యాలయం (ఆస్ట్రేలియా) ప్రొఫెసర్ అతుల్‌జినిజ్ తదితరులు వివిధ అంశాలను, తమ అనుభవాలను వివరించారు. ప్రధాన సంస్థలు, విద్యార్థులు 160 పైగా పరిశోధన పత్రాలు తయారు చేసి అందించారు. వికసిత్ భారత్‌పై సావనీర్‌ను విడుదల చేశారు. స్వామినాథన్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సెంచూరియన్ విశ్వ విద్యాలయం డీన్, ప్రొఫెసర్లు అనిత పాత్రో, రవి నారాయణ, ప్రజ్ఞ, వీసీ సుప్రియ పట్నాయక్ పాల్గొన్నారు.



ఎంపీవోగా అప్పలనాయుడు

జలుమూరు: ఎంపీడీవోగా కె.అప్పలనాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అనకాపల్లి జిల్లా యలమంచిలి నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతనంగా వచ్చిన ఎంపీడీవోను సిబ్బంది అభినందించారు.

సారవకోట ఎంపీడీవోగా మురళీ మోహన్ కుమార్

జలుమూరు (సారవకోట): సారవకోట ఎంపీడీవోగా మురళీ మోహన్ కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన రాంబాబు విజయనగరం జిల్లా బదిలీ అయ్యారు. మురళీమోహన్‌కుమార్ సరుబుజ్జిలి నుంచి ఇక్కడికి వచ్చారు.

అత్యాచారం కేసుపై డీఎస్పీ విచారణ

జలుమూరు, (సారవకోట): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై అత్యాచారం కేసుపై శ్రీకాకుళం మహిళా పోలీసు స్టేషను డీఎస్పీ బి.రాజశేఖర్ శుక్రవారం విచారణ చేపట్టారు. బాధితురాలు, తల్లితో మాట్లాడి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు.

ఆకతాయిలపై అప్రమత్తంగా ఉండండి

వజ్రపుకొత్తూరు: ఆకతాయిలపై బాలికలు అప్రమత్తంగా ఉండాలని నాట్ హోప్ లైఫ్ ప్రతినిధులు అన్నారు. శుక్రవారం పూండి హైస్కూల్‌లో గ్లోసంస్థ అండ్ నాట్ హోప్‌ఫర్ లైఫ్ సౌజన్యంతో విద్యార్థులు వివిధ అంశాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పి.ఈశ్వరరావు, కర్ని రమణ, హెచ్‌ఎం హరిబాబు, ప్రిన్సిపాల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై త్వరితగతిన పరిష్కారం: ఎస్పీ

పలాస: ఫిర్యాదుల విభాగంలో వివిధ సమస్యలపై వినతులిచ్చేందుకు వచ్చిన బాధితులకు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పూర్తి భరోసా కల్పించారు. శుక్రవారం కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో ప్రజా సమ స్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చే సమస్యలపై విచారణ చేపట్టి త్వరితగతిన పరిష్కారం చూపుతామన్నారు. ఎస్పీ గ్రీవెన్స్‌కు 12 ఫిర్యాదులు రాగా వాటిని సంబంధిత స్టేషన్ హౌస్ అధికారులకు పరిష్కారం నిమిత్తం పంపించారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

ఎచ్చెర్ల: ఎస్ఎం పురం గ్రామానికి చెందిన సూరాడ రాజారావు(66) ఈ నెల 23న ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. మద్యానికి బానిసైన రాజారావును భార్య రాజులమ్మ వద్దని వారించడంతో మనస్తాపానికి గురై గడ్డి మందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు రిమ్స్‌లో చేర్పించగా శుక్రవారం మృతిచెందాడు. రాజారావుకి భార్య రాజులమ్మ, నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ వి.సందీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నొప్పులు భరించలేక ఒకరు..

ఎచ్చెర్ల: కమ్మవానిపేట గ్రామానికి చెందిన బాడాన గోవిందాచార్యులు(48) అనే వ్యక్తి నొప్పులు భరించలేక గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దివ్యాంగుడైన గోవిందాచార్యులు శరీర భాగాల్లో నొప్పులు భరించలేక జీవితంపై విరక్తి చెంది గురువారం గడ్డిమందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలో చేర్పించగా చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందాడు. గోవిందాచార్యులకు భార్య వైకుంఠంతో పాటు ఒక కుమారుడు ఉన్నాడు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ వి.సందీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గల్లంతైన వ్యక్తి ఆచూకీ ఏదీ?

సోంపేట: సముద్రంలో బుధవారం బోటు బోల్తాపడిన ఘటన బారువ కొత్తూరుకు చెందిన రట్టి అప్పన్న గల్లంతైన విషయం విదితమే. అయితే అప్పన్న ఆచూకీ నేటివరకు పోలీసులు కనుగొనలేకపోవడంతో ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఫోన్‌లో నిలదీశారు. బోటు ప్రమాదం జరిగి నాలుగురోజులు గడుస్తున్నా అతడి ఆచూకీ కనుగొనపోవడం నిర్లక్ష్యానికి అద్దం పడుతోందిని మండిపడ్డారు. బారువ సమీపంలోనే మెరైన్ స్టేషన్, బారువ పోలీస్ స్టేషన్ ఉన్నప్పటికీ వ్యక్తి ఆచూకీ కనుగొనలేకపోయారని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. వెంటనే సముద్రంలో సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి ఆచూకీ కనుగొనాలని ఆదేశించారు. ఈయనతోపాటు మద్దు కుమార్, గ్రామస్థులు కూడా పోలీసులతో మాట్లాడుతూ వెంటనే ఆచూకీ కనుగొనే ఏర్పాట్లు చేయాలని సూచించారు.

డొంకలు తొలగించారు..



పిచ్చి మొక్కలు తొలగించకు ముందు.. తర్వాత ఇలా..

లావేరు: మండల కేంద్రం లావేరు హౌసింగ్ కార్యాలయానికి వెళ్లే రహదారిలో డొంకలను శుక్రవారం తొలగించారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో దారేది అనే శీర్షికతో ప్రచురితం కావడంతో సంబంధిత అధికారులు స్పందించి వాటిని తొలగించారు. గతంలో ఈ కార్యాలయానికి భయ పడుతూ వెళ్లే వాళ్లు ఇప్పు నిర్భయంగా వెళ్తూ 'ఆంధ్రజ్యోతి'కి ధన్యవాదాలు తెలుపుతున్నారు.

ఇసుకపై టీడీపీలో అంతర్గత పోరు


పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న ఇసుక లారీలు

సరుబుజ్జిలి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇసుక విధానంపై స్పష్టత ఇవ్వక పోవడంతో జిల్లాలో ఏర్పడిన ఇసుక కొరత రోజు రోజుకు రాద్ధాంతం అవుతుంది. కొన్ని ప్రాంతాల్లో అడ్డూ ఆపూ లేకుండా కొంతమంది అధికార పార్టీ నాయకుల సిఫార్సులతో అధికారులు మౌనం వహించడంతో యథేచ్ఛగా ఇసుక తరలించుకుపోతున్నారు. అయితే పాతప ట్నం నియోజకవర్గంలో మాత్రం ఇసుక రవాణాపై టీడీపీ నాయకుల మధ్య అంత ర్గత పోరు కొనసాగుతోంది. కొద్ది రోజుల కొత్తూరు మండలంలో ఆ పార్టీ జిల్లా అధ్య క్షుడు కలమట ఒక గ్రామంలో ఆ గ్రామస్థులు అడ్డుకున్న ఇసుక లారీలపై నిరసన తెలిపారు. ఈ ఘటన జిల్లాతో పాటు రాష్ట్ర స్థాయిలో చర్చ జరిగింది. ఒడిశా రాష్ట్రంలో వంశధార ఇసుక ర్యాంప్‌ల నుంచి ప్రతిరోజూ వందల సంఖ్య లారీల్లో విశాఖకు ఇసుక రవాణా చేస్తున్నాయి. ఒడిశా రాష్ట్ర గుమ్మడ ప్రాంతం రశీదులతో కొంతమంది ఏపీ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో ఇసుక అక్రమంగా తవ్వకాలు జరిపి రవాణా చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 21న పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు (ఎంజీఆర్) సరుబుజ్జిలి మండలం కొత్తకోట గ్రామం వద్ద మూడు ఇసుక లారీలు ఆపి వారి వద్ద ఉన్న పత్రాలను పరిశీలించి అనుమానంతో స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో లారీలను సరుబుజ్జిలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ధ్రువపత్రాలపై ఉన్న క్యూఆర్ కోడ్ ఆధారంగా పరిశీలించగా లారీలు ప్రయాణించే సమయానికి రశీదులపై ఉన్న సమయానికి వ్యత్యాసం ఉన్నట్టు గుర్తించారు. ఈ విషయంపై కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడుతానని ఇసుక లారీలు ఎవరి ప్రమేయంతో అక్రమ రవాణా చేస్తున్నారో సమగ్ర విచారణ జరిపించి వివరాలు వెల్లడించాలని ఎమ్మెల్యే గోవిందరావు పోలీసులకు తెలిపారు. కాగా ఈ మూడు ఇసుక లారీలు ప్రస్తుతానికి సరుబుజ్జిలి పోలీసుస్టేషన్ వద్దే ఉన్నా కేసు మాత్రం నమోదు చేయలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై ఇన్‌చార్జి ఎస్ఐ టి.రాజేష్‌ను వివరణ కోరగా.. ఈ మూడు ఇసుకమ లారీల విషయాన్ని జిల్లా గను ల శాఖకు తెలిపామని, వారు తీసుకునే చర్యల కోసం వేచిస్తున్నామని తెలిపారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

బూర్జ: గుత్తావల్లి గ్రామానికి చెందిన సనపల సురేష్‌కుమార్‌పై ఇదే మండలం నీలంపేట గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు దాడిచేయగా, గాయపడిన సురేష్‌కుమార్ శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. రిమ్స్ ఔట్ పోస్టు పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. సురేష్‌కుమార్ నారాయణపురం గ్రామం వద్ద గురువారం తనకారు ఆపి కూర్చుండగా, నీలంపేట గ్రామానికి చెందిన కోడి గోవిందరావు, రమేష్, గుండ విష్ణుతోపాటు మరో నలుగురు వ్యక్తులు దాడి చేశారు. అక్కడ ఉన్న గ్రామస్థులు స్పందించి అతడిని తనని కాపాడారు. గాయపడిన సురేష్‌ను చికిత్స నమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. రిమ్స్ ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా సురేష్ కుమార్ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆమదాలవలస నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. కాఖండ్యాం వద్ద నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపు అక్రమాలపై గతంలో కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేసి.. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేశారు. ఈ విషయంలోనే తనపై కక్ష పెట్టుకునే దాడి చేసినట్టు సురేష్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కొత్తపేటలో రెండిళ్లలో చోరీ

కోటబొమ్మాళి: కొత్తపేట గ్రామంలో గురువారం అర్ధరాత్రి రెండిళ్లలో చోరీ జరిగింది. దాట్ల కళావతి ఇంట్లో చొరబడి పావు తక్కువ మూడు తులాల బంగారు ఆభరణాలు, దుక్క కళావతి ఇంట్లో రెండు తులాల ఆభరణాలు చోరీకి పాల్పడ్డారు. కళావతమ్మ కోట బొమ్మాళి ఆర్ఎస్‌లో తన కుమార్తె ఇంటికి వెళ్లగా, వెంకటమ్మ ఇటీవల తన అత్త మృతి చెందడంతో కొద్ది రోజులు ఆ ఇంటిలో ఉండవద్దని కొందరు సూచించడంతో కొద్ది దూరంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటోంది. ఈ రెండిళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. తాళాలు పగలగొట్టి ఉండడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శ్రీకాకుళం నుంచి క్లూస్ టీం వచ్చి పరిశీలించారు.

వేరొకచోటుకు అంగన్‌వాడీ కేంద్రం

గార: అంపోలు పంచాయతీ ఆడ వరం గ్రామంలో శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ భవనం వేరొక చోటుకు మార్పించారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో ఈ భవనం దుస్థితిపై వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. దీంతో శిథిల భవనాన్ని కమ్మలతో మూయించారు.



కొబ్బరి కమ్మలతో మూసివేసిన కేంద్రం

దివ్యాంగులకు ర్యాంపుల ఏర్పాటు

- ఆలయాలు, ఆసుపత్రుల్లో ప్రత్యేక లైన్లు
- ఆర్‌పీడబ్ల్యూడీ యాక్ట్‌పై అవగాహన
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్: దివ్యాంగుల కోసం ప్రతీ ప్రభుత్వ కార్యాలయాల్లో ర్యాంపుల నిర్మాణం చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జడ్పీ సమావేశం మందిరంలో శుక్రవారం నిర్వహించిన దివ్యాంగుల హక్కులు (ఆర్‌పీడబ్ల్యూడీ యాక్ట్) అమలు సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దివ్యాంగుల కోసం ఆర్టీసీ కాంప్లెక్స్, దేవాలయాలు, ఆసుపత్రుల్లో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఆర్‌పీడబ్ల్యూడీ చట్టంపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. సీనియర్ సిటిజన్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ చట్టంపై ప్రతీ పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో అవగాహన కల్పించాలని, మీడియా ద్వారా ప్రచారానికి సహకరించాలన్నారు. సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు మాట్లాడుతూ.. జిల్లాలో ఈ చట్టంపై అవగాహన కల్పించడంలో చాలా వెనుకబడి ఉన్నామన్నారు. జిల్లాలో గల వృద్ధాశ్రమాలు ఏపీ రిజిస్ట్రేషన్ కాలేదన్నారు. సమాజంలో మార్పు రావాలంటే ప్రజల ఆలోచనా విధానంలో మార్పు రావాలన్నారు. ఈ సందర్భంగా సంజ్ఞలతో కూడిన అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ దివ్యాంగులకు చేపట్టిన జాబ్ మేళాలో ఎంపికైన వారికి మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీపీవో వెంకటేశ్వరరావు, జడ్పీ సీఈవో వెంకటరామన్, డీఎంహెచ్‌వో మీనాక్షి, రిమ్స్ సూపరింటెండెంట్ షకీలా, ఆర్ఎంవో సుభాషిణి తదితరులు పాల్గొన్నారు. అలాగే వచ్చే నెల 1వ తేదీన నిర్వహించనున్న వరల్డ్ మెంటల్ హెల్త్ డే కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్స్‌ను ఎస్‌పీ ఫౌండేషన్, యునైటెడ్ ఎన్జీవోస్ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆవిష్కరించారు.

నేడు 'మన ఇళ్లు.. మన గౌరవం'

శ్రీకాకుళం కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా 'మన ఇళ్లు.. మన గౌరవం' కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన జిల్లా, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వచ్చే ఏడాది ఫిబ్రవరిలోగా నిర్మాణాలు పూర్తి చేయాలని, లేకుంటే అవి రద్దవుతాయన్నారు. శనివారం ప్రతీ లే అవుట్‌లోను లబ్ధిదారులతో సమావేశమై అవగాహన కల్పించి, ఏవైనా సమస్యలుంటే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా సదస్సులకు ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరవుతారని, అలాగే లేఅవుట్ ఇన్‌చార్జీలు, హౌసింగ్ ఇంజనీర్లు, సచివాలయ సంక్షేమ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు హాజరు కావాలని ఆదేశించారు. మౌలిక వసతులు కల్పనలో విద్యుత్తు, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ అధికారులు భాగస్వాములు కావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆ దిశగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని హౌసింగ్ డీఎం బి.నగేష్‌ను ఆదేశించారు.

విదేశీ పక్షులకు రక్షణ కల్పిస్తాం

ఇచ్ఛాపురం: తేలుకుంచి వద్ద సేదతీరున్న విదేశీ పక్షులకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పిస్తామని జిల్లా అటవీశాఖ అధికారి యాళ్ల సంజయ్ గ్రామస్థులకు హామీ ఇచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సంజయ్ తేలుకుంచి విదేశీ వలస పక్షుల కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పక్షుల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో (ఏసీఎఫ్) అసిస్టెంట్ కన్సర్వేటర్ నాగేంద్రరావు, పలాసా రేంజ్ అధికారి మురళీ కృష్ణమనాయుడు, మందస డీఆర్ఓ రాము, బీట్ అధికారులు భానుమూర్తి, జోగారావు, సురేష్, పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీఎఫ్‌వో


కలెక్టర్‌తో డీఎఫ్‌వో సంజయ్

శ్రీకాకుళం కలెక్టరేట్: జిల్లా అటవీశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన యాళ్ల సంజయ్ శుక్రవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు పలు విషయాలపై చర్చించారు.

ఎస్పీని కలిసిన ఎక్సైజ్ డీసీ


ఎస్పీతో ఎక్సైజ్ డీసీ

శ్రీకాకుళం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని శుక్రవారం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్పీకి ఆయన పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం శాఖాపరమైన అంశాలపై చర్చించారు.

టీడీపీలో చేరికలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్

కంచిలి: మండలంలోని జాడుపూడి గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌తోపాటు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజును గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన పూర్తయిన సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేను దుశ్శాలువ, గజమాలలతో సత్కరించారు. ఎమ్మెల్యే సమక్షంలో గ్రామానికి చెందిన వైసీపీ సానుభూతిపరులు, పిలక మోహనరావుకు చెందిన సుమారు 20 మంది టీడీపీలో చేరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మాదిన రామారావు, పిలక చినబాబు, బంగారు కురయ్య ఎం.పూర్ణ, ఎస్.కామేష్, ఎం.ధర్మా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అరసవల్లి లడ్డూ తయారీ పరిశీలన


ఆహార పదార్థాలు తనిఖీ చేస్తున్న దృశ్యం

అరసవల్లి: ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి దేవస్థానంలో తయారుచేస్తున్న లడ్డూ, పులిహోర ప్రసాదాల తయారీని జిల్లా ఆహార నియంత్రణాధికారి కె.వెంకటరత్నం శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రసాదాల తయారీకి వినియోగించే వస్తువులు, ఆవు నెయ్యి, శనగపప్పు, మసాలా దినుసులు పరిశీలించారు. అలాగే శాంపిల్స్‌ను సేకరించి ప్రయోగశాలకు పంపించారు. కార్యక్రమంలో సహాయ ఆహార నియంత్రణాధికారి లక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థి కుటుంబానికి పరిహారం


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం: పాతర్లపల్లి హైస్కూల్ ఘటనలో సన్‌షేడ్ మీద నుంచి పడి మృతి చెందిన పదో తరగతి విద్యార్థి కృష్ణంరాజు కుటుంబానికి ప్రభుత్వం తరుపున రూ.5 లక్షల చెక్‌ను శుక్రవారం ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు చేతుల మీదగా అందజేశారు. ఈ చెక్ సర్వశిక్షా అభియాన్ వారి ద్వారా ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. డీఈవో తిరుమల చైతన్య, తహసీల్దార్ ఎన్.ప్రసాద్, కూటమి నాయకులు గొర్లె లక్ష్మణరావు, లంక శ్యామలరావు, పిసిని జగన్నాథంనాయుడు, గొర్లె సాయి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సుపరిపాలన

జి.సిగడాం: రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారని విజయనగరం పార్లమెంటరీ బీసీ కమిటీ అధికార ప్రతినిధి, మాజీ సర్పంచ్ కంచరాన సూరన్నాయుడు అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలో పలు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. దవళపేటలో స్వచ్ఛత హి కార్యక్రమంతో పాటు ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మాతా శిశు సంక్షేమమే లక్ష్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

గార: మాతా శిశు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శుక్రవారం ఉదయం కొల్లివలస వద్ద ఐసీడీఎస్ ప్రోజెక్టు కార్యాలయంలో నిర్వహించిన పోషణ్ అభియాన్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఐసీడీఎస్ పీవో శాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

● **అరసవల్లి:** పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని టీడీపీ శ్రీకాకుళ నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతి అన్నారు. నగరంలోని 34వ డివిజన్‌లో, ఇన్‌చార్జి చిట్టిబాబు ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఉమెన్ ప్రొటెక్షన్ సబీనా పర్వీన్, సూపర్‌వైజర్ యోగీశ్వరి, ఏఎన్ఎం ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి

జి..సిగడాం: కిశోర బాలికలు ఆరోగ్య జాగ్రత్తలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎచ్చెర్ల ఐసీడీఎస్ పీవో డోల పాపినాయుడు అన్నారు. శుక్రవారం సంతవురిటి, జి.సిగడాం గ్రామాల్లో పౌష్టికాహారం మాసోత్సవాలు నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవోలు అరసాడ రవి, శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ కార్యకర్తలు ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

బాహుదా నదిపై వంతెన నిర్మించండి

ఇచ్ఛాపురం: బ్రిటిష్ కాలం నాటి బాహుదానదిపై కొత్తగా వంతెన నిర్మాణం చేపట్టాలని ఆర్అండ్‌బీ ఇంజనీర్ చీఫ్ నయిముల్లాను మాజీ సీడాప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం విజయవాడ కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఏడాది కిందట ఈ వంతెన సగ భాగం కూలిపోయిందని, తాత్కాలిక మరమ్మతులతో కార్లు, ద్విచక్ర వాహనాలు మాత్రమే రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. ఈ తాత్కాలిక పనుల వల్ల వందలాది గ్రామాల ప్రజలు ఇబ్బందిపడుతున్నారని ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు.

హిందువులు సంఘటితంగా ఉండాలి

సంతబొమ్మాళి: హిందువులంతా సంఘటితంగా ఉండాల్సిన సమయం ఆసన్నమైందని నిర్విష్యానంద స్వామి, యోగా చంద్రశేఖర్ కోరారు. విశ్వహిందూ పరిషత్ స్థాపించి 60 ఏళ్ల పూర్తయిన సందర్భంగా బోరుభద్రలో ప్రఖండ సమావేశం నిర్వహించారు. హిందువులంతా సమక్యంగా ధర్మరక్షణకు ముందుకు రావాలని, అప్పుడే సనాతన ధర్మం నిలబడుతుందన్నారు.

ఘనంగా పర్యాటక దినోత్సవం

సోంపేట: స్థానిక బారువ డిగ్రీ కళాశాలలో ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డి.రామారావు అధ్యక్షతన చేపట్టిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. క్విజ్, రంగవల్లుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాహితీ చైతన్య కిరణాలు ఆధ్వర్యంలో..

శ్రీకాకుళం కల్చరల్: నగరంలో బలగ బెజ్జిపురం యూత్ క్లబ్ భవనంలో శుక్రవారం పర్యాటక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సాహితీ చైతన్య కిరణాలు సంస్థ ఉపాధ్యక్షులు పి.దేవానంద్ పర్యాటక దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో శోధన కల్చరల్ సంస్థ కో ఆర్డినేటర్ సత్యనారాయణ, బెజ్జిపురం యూత్ క్లబ్ కోఆర్డినేటర్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. పోస్టర్స్‌ను ఆవిష్కరించారు.

తమ్మినేనికి అభినందనలు

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డుకు చెందిన నాయకులు, కార్యకర్తలు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను కలిసి అభినందనలు తెలిపారు. శ్రీకాకుళం పార్లమెంటరీ వైసీపీ పరిశీలకుడిగా నియమితులైన తమ్మినేని సీతారాంను తన నివాసంలో పలువురు నాయకులు కలిసి సత్కరించారు. రమేష్‌కుమార్, ఉమామహేశ్వరరావు, శ్యామలరావు, శ్రీను పాల్గొన్నారు.

జనసేన నాయకుల శాంతిహోమం

పలాస: స్థానిక ఉల్లాసపేట వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో జనసేన నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం శాంతిహోమం నిర్వహించారు. తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ చేసినందున దీనిని వ్యతిరేకిస్తూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేస్తున్న ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా చేపట్టినట్లు ఆ పార్టీ నాయకుడు దుర్గారావు తెలిపారు.

విలువలతో చదువుకోవాలి

గుజరాతీపేట: విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన చదువు అవసరమని కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. చదువు ఒక్కటే ప్రాధాన్యం ఇవ్వకుండా వినోదం ఉండాలని విద్యార్థులకు సూచించారు. సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు మాట్లాడుతూ.. రోజురోజుకు ప్రపంచ వ్యాప్తంగా పర్యాటక రంగం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ఇంటాక్ కో కన్వీనర్ నటుకుల మోహన్, మాజీ కన్వీనర్ రాధా ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రం తెరిపించండి

శ్రీకాకుళం రూరల్: పొన్నాం పంచాయతీ నవనంబాడు గ్రామంలో మూతబడిన ఆరోగ్య ఉప కేంద్రాన్ని తిరిగి తెరిపించాలని కూటమి నాయకులు కోరుతున్నారు. ఈ మేరకు శుక్రవారం జనసేన పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు టీకే రామారావు ఆధ్వర్యంలో మూతబడిన ఆరోగ్య ఉప కేంద్రాన్ని గ్రామనులతో కలిసి కూటమి నాయకులు పరిశీలించారు. ఎన్నికల ముందు గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే గొండు శంకర్ అధికారంలోకి వచ్చాక ఈ కేంద్రాన్ని తెరిపిస్తామని హామీ ఇచ్చారని, ఆ మేరకు నిధులు మంజూరు చేసి వైద్య సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చందు, రాజేష్, రాంబాబు, శివ, వెంకటరావు, అప్పలనాయుడు, రంగ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను మార్చాలి

నరసన్నపేట: శిథిలావస్థలో ఉన్న భవనాల్లోని పోలింగ్ బూత్‌లను మార్చేందుకు చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ఆర్వో రామ్మోహన్‌రావు అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. నరసన్నపేట, పోలాకి మండలాల్లో నాలుగు కేంద్రాలను మార్చేందుకు ప్రతిపాదనలు పంపాలన్నారు.

సోషల్ మీడియాకు దూరంగా ఉండండి

పోలాకి: కళాశాల, పాఠశాలల విద్యార్థులు సోషల్‌మీడియాకు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని ఎస్ఐ రంజిత్ అన్నారు. శుక్రవారం ఈదులవలస మోడల్‌స్కూల్, కళాశాలలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సెల్‌ఫోన్లు, సోషల్ మీడియా, యూట్యూబ్ చానల్స్‌లో వచ్చే కథనాల వల్ల విద్యార్థులు వ్యసనాలకు బానిసలవుతున్నారన్నారు. బాలికలు నిర్మానుష్య ప్రదేశాలకు వెళ్లవద్దన్నారు. ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను అధిగమించాలి

పాతపట్నం: మినీ గోకుల లబ్ధిదారుల ఎంపికలో నిర్దేశిత లక్ష్యాలను అధిగమించాలని పశు సంవర్ధక శాఖ ఏడీ మంచు కరుణాకర్ అన్నారు. స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాలలో పాత పట్నం, మెళియాపుట్టి మండలాల సిబ్బందితో సమీక్షించారు. సంచార పశువైద్య సేవలను పశు పోషకులు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం 21వ అఖిల భారత పశుగణన కిట్లను పంపిణీ చేశారు. సమావేశంలో పశువైద్యాధికారులు బి.శ్రీవాణి, పి.అనిల్, కె.మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి ఉత్సవాల్లో భాగంగా అక్టోబరు ఒకటి నుంచి 3వ తేదీ వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, కబడ్డీ, సంగిడీలు, ఉలవ బస్తాల పోటీలను నిర్వహించి విజయవంతం చేయాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శుక్రవారం కార్యక్రమాలు, పోటీలు నిర్వహించనున్న కోటబొమ్మాళిలోని జడ్పీ ఉన్నత పాఠశాల మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అంతకుముందు ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ నేతలతో ఉత్సవాల నిర్వహణపై సమీక్షించారు. అలాగే కొత్తమ్మతల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఏర్పాట్లపై ఈవో వాకచర్ల రాధా కృష్ణతో చర్చించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో గాంధీయాన్ సోషల్‌వర్క్ పీజీ డిప్లమో కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒక ఏడాది గల ఈ కోర్సులో చేరేందుకు ఏదైనా డిగ్రీ చదివినవారు అర్హులన్నారు. రూ.250 అప్లికేషన్ ఫీజు, రూ.2,500 ట్యూషన్ ఫీజును రిజిస్ట్రార్, డాక్టర్ బీఆర్ఏయూ పేరిట డిమాండ్ డ్రాఫ్ట్ తీసి దరఖాస్తులను వచ్చే నెల 5వ తేదీలోగా వర్సిటీలోని సోషల్‌వర్క్ విభాగానికి అందజేయాలన్నారు. ఈ కోర్సు పూర్తిచేసినవారికి ఎన్జీవో, మీడియా సంస్థల్లో, గ్రామీణాభివృద్ధి శాఖ, ఆరోగ్య సంబంధిత ప్రాజెక్టులు, కౌన్సెలింగ్ కేంద్రాలు, సామాజిక అధ్యయన కేంద్రాల్లో ఉపాధి పొందే వీలుందన్నారు. మరిన్ని వివరాల కోసం సోషల్‌వర్క్ కోర్సు విభాగాధిపతి డాక్టర్ యు.కావ్యజ్యోత్స్న ఫోన్ నెంబర్లు 94945 20417, 63045 20703కు సంప్రదించాలన్నారు. అలాగే వర్సిటీ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ డీఆర్‌బీఆర్‌ఏయూ డాట్ ఈడీయూ డాట్ ఇన్‌ను పరిశీలించాలన్నారు.

కేజీబీవీల్లోని పోస్టులకు..

గుజరాతీపేట: జిల్లాలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది పోస్టుల భర్తీకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. బోధన సిబ్బంది పోస్టులకు సంబంధించి ఒప్పంద ప్రాతిపదికన (కాంట్రాక్టు), బోధనేతర సిబ్బందికు సంబంధించి ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన 2024-25 విద్యా సంవత్సరానికి గాను అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు పేర్కొన్నారు. ఇందులో పీజీటీ మూడు, సీఆర్టీ 13, వార్డెన్ మూడు, పార్ట్ టైమ్ టీచర్స్ 16, అకౌంటెంట్ మూడు ఇలా.. మొత్తం 38 పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తికలిగిన మహిళా అభ్యర్థులు తమ ఆన్‌లైన్ దరఖాస్తులను వారి వెబ్‌సైట్ ద్వారా రూ.250 దరఖాస్తు రుసుం చెల్లించి అక్టోబరు పదో తేదీలోగా పంపించాలన్నారు. ఆఫ్‌లైన్, ఫిజికల్ దరఖాస్తులు స్వీకరించబడవని, అభ్యర్థులకు 18 నుంచి 42 సంవత్సరాల వయస్సు వారు అర్హులని, ఎస్సీ, ఎస్టీ, బీసీలు, ఈడబ్ల్యూఎస్ వారికి ఐదేళ్లు, మాజీ సైనిక ఉద్యోగినులకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుందన్నారు.

అడంగళ్లు రావడం లేదు

సోంపేట: కొర్లాం గ్రామానికి చెందిన అగ్రహారం చెరువు ఆయకట్టు రైతులకు అడంగళ్లు ఇప్పించాలని ఆర్డీవో భరత్‌నాయక్‌కు రైతులు శుక్రవారం వినతి పత్రం అందించారు. చెరువ ఆయకట్టులో సర్వే నెంబరు 50 నుంచి 110వరకు ఉన్న భూములకు అడంగళ్లు తహసీల్దార్ కార్యాలయంలో రావటంలేదని తెలిపారు. ఈ భూములు తమవని కృష్ణచంద్రపాడీ ఫిర్యాదు మేరకు తహసీల్దార్ లాగిన్ నుంచి తొలగించారన్నారు. అయితే ఈ భూములు కొర్లాం, లక్కవరం, పలాసపురం రైతులు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అమ్మకాలు కొనుగోలు చేసుకున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. కాబట్టి విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో రాంబుడ్డి గణపతి, సంగారు డిల్లీరావు, పెద్దింటి సోమేశ్వరరావు, రాంబుడ్డి జానకిరావు ఉన్నారు.

రక్షిత నీటి ట్యాంక్ తొలగించండి

ఇచ్ఛాపురం: తేలుకుంచి గ్రామంలో దశాబ్దాల కిందట నిర్మించిన రక్షిత నీటి పథకం ట్యాంక్ శిథిలావస్థకు చేరుకొని కూలేందుకు సిద్ధంగా ఉందని వెంటనే దాన్ని కూల్చివేయాలని ఆ గ్రామ సర్పంచ్ పాతిర్ల రాజశేఖర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఇన్‌చార్జి ఎంపీడీవోకి వినతిపత్రం అందజేశారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ బోర పుష్ప అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. గత ప్రభుత్వంలో ఏ పనులు పూర్తిగా జరగలేదని, ప్రభుత్వం మారినా అధికారుల తీరుమాత్రం మారలేదని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీటీసీ సభ్యులు చక్రవర్తిరెడ్డి అన్నారు. అరకబద్ర గ్రామం వద్ద బాహుదానది వంతెనపై అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టి, రోడ్డుకిరువైపులా వాల్స్ నిర్మించకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి అంతా కొట్టుకుపోయింద ఎంపీటీసీ సభ్యురాలు సాడి కాంచన అన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో రామారావు, ఏవో భార్గవి, జడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సెలవులు మంజూరు చేయాలి

గుజరాతీపేట: వేసవి-2022లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులను మంజూరు చేయాలని, తితలీ తుఫాన్ సమయంలో ఆయా గ్రామాల్లో భోజనాలు కార్యక్రమం ఏర్పాటు చేసిన ఉపాధ్యాయులకు అందుకు అయిన ఖర్చులు అందజేయాలని డీఈవో తిరుమల చైతన్యను ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. జడ్పీలోని పీఎఫ్ సెక్షన్లో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, అలాగే ఏపీజీఎల్ఐ కార్యాలయంలో ఉపాధ్యాయుల సమస్యలు పెండింగ్‌లో లేకుండా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎం.మధన్‌మోహన్, ప్రధాన కార్యదర్శి ఎస్వీ అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడు భీమారావు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయండి

కవిటి: ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్స్‌ను రెగ్యులర్ చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను కోరారు. ఈ మేరకు ఇచ్ఛాపురం నియోజకవర్గం కాంట్రాక్టు లెక్చరర్లు వినతిపత్రాన్ని అందించారు. రామయ్యపుట్టుగలో శుక్రవారం ఎమ్మెల్యేను వీరంతా కలిసి తమ సమస్యలను వివరించారు. కూటమి ప్రభుత్వంలో కాంట్రాక్టు లెక్చరర్స్‌కు న్యాయం జరిగేలా చూడాలని వారు కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పి.సుధాకర్, పద్మనాభ చౌదరి, పి.హరి, బి.శ్రీనుబాబు, ఎస్.రజని, రామినాయుడు, పాపారావు తదితరులు ఉన్నారు.

అమ్మో తోటపాలెం రోడ్డా?


చెరువును తలపిస్తున్న తోటపాలెం రోడ్డు

ఎచ్చెర్ల: చిన్నపాటి చినుకు పడినా ఆ రోడ్డు చెరువును తలపిస్తుంది. నిత్యమూ రద్దీగా ఉండే ఈ రోడ్డులో చిన్నపాటి వర్షానికి ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయి రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతుంది. శ్రీకాకుళం నగరానికి అతి చేరువలో తోటపాలెం గ్రామానికి వెళ్లే రోడ్డు దుస్థితి ఇది. ఈ రోడ్డుపై ప్రయాణం సాగించాలంటే వాహనచోదకులు, పాదచారులు భయపడుతున్నారు. ప్రేమ సమాజం జంక్షన్ నుంచి తోటపాలెం వైపు వెళ్లే ఈ రోడ్డును మెరుగుపర్చాలని స్థానికులు కోరుతున్నారు.